క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నర్సాపూర్ రూరల్: రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని ఐసీఏఆర్, ఐఐఆర్ఆర్, కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మండలంలోని అవంచలో రైతులకు పంటల సాగు, సస్యరక్షణ, భూసార పరీక్షలు, తక్కువ పెట్టుబడితో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ఎస్‌డి, నల్కర్, ఇతర శాస్త్రవేత్తలు గోపాల్ కృష్ణ, మండల వ్యవసాయ అధికారిణి దీపిక పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు నోటీసు


కరీంకుంటను పరిశీలిస్తున్న ఏఈ సుధీర్‌కుమార్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి కొంతన్‌పల్లిలోని కరీంకుంట శిఖం భూమి కబ్జా గురించి సాక్షి దినపత్రికలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. ఇరిగేషన్ ఏఈ సుధీర్‌కుమార్ కరీంకుంటను పరిశీలించారు. శిఖం భూమిని కబ్జా చేసిన వెంచర్ నిర్వాహకులకు నోటీసు ఇచ్చారు. కుంటకు సంబంధించిన శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు.

స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు కాళ్లకల్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింగం తెలిపారు. పాఠశాలకు చెందిన సమీక్ష, జల్లి అనిల్, జి.విఘ్నేష్‌లు, రంగాయపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రితేష్‌కుమార్, నవీన్‌కుమార్, మనోజ్‌లు మెరిట్ సాధించినట్లు ఉపాధ్యాయుడు మురళి మనోహర్ తెలిపారు. వీరికి సంవత్సరానికి ఆరు వేల చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందన్నారు.

ఇంటి నిర్మాణాలు చేపట్టేలా ప్రోత్సహించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపట్టేలా కార్యదర్శులు ప్రోత్సాహించాలని ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి అన్నారు. శుక్రవారం చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ శ్యామ్‌తో కలసి పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ఒకటి లేదా రెండు మురుగు కాల్వల చివరన ఇంకుడు గుంతలు నిర్మించేందుకు ఒకదానికి రూ.92 వేలు మంజూరయ్యాయని తెలిపారు. మండల వ్యాప్తంగా నాటేందుకు లక్ష మొక్కలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాలలో మౌలిక వసతులకు ఎలాంటి లోటు లేకుండా చూడాలన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే భూభారతి : ఆర్డీఓ రమాదేవి

టేక్మాల్(మెదక్): భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూభారతిని తీసుకువచ్చిందని మెదక్ ఆర్డీఓ రమాదేవి తెలిపారు. శుక్రవారం టేక్మాల్ మండలం బొడ్మట్పల్లి, బర్దిపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు భూమికి సంబంధించిన ఎటువంటి సమస్యలు ఉన్న దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి దరఖాస్తులు పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తులసీరాం, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, ఆర్ఐ సాయి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

పాపన్నపేట(మెదక్): భూసమస్యలు ఉన్న వారు భూభారతి సమావేశాల్లో దరఖాస్తులు చేసుకోవాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం పాపన్నపేట మండలం నామాపూర్‌లో జరిగిన భూభారతి సదస్సులో ఆమె మాట్లాడారు. నామాపూర్‌లో 53, గాంధారిపల్లిలో 23 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సతీష్ తెలిపారు.

రక్తదానం ప్రాణదానం

నారాయణఖేడ్: ఆపరేషన్ సిందూర్‌లో అసువులు బాసిన అమర జవాన్ల స్మారకార్థం ఖేడ్ శ్రీరామ్‌సేన ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం 60మంది యువకులు రక్త దానం చేసి దేశభక్తిని చాటుకున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమ్మె బాట

రెండు నెలలుగా అందని వేతనాలు

- పీఎఫ్ డబ్బులూ జమకాని వైనం
- అర్ధాకలితో అలమటిస్తున్నామని కార్మికుల ఆవేదన
- సమ్మెతో పట్టణమంతా 'చెత్త'మయం


పట్టణంలో పేరుకుపోయిన చెత్త కుప్పలు


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

రామాయంపేట(మెదక్): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పారిశుద్ధ్య కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో పట్టణంలో ఎక్కడికక్కడ చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ విషయమై మున్సిపల్ శాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల వైఖరికి నిరసనగా కార్మికులు కార్యాలయ ఎదుట బైఠాయించారు. వివరాల్లోకి వెళితే.. మున్సిపాలిటీ పరిధిలో రామాయంపేట పట్టణంతోపాటు కోమటిపల్లి, గుల్పర్తి గ్రామాలు, రెండు గిరిజన తండాలు ఉన్నాయి. 23 వేలకు పైగా జనాభా ఉంటుంది. పట్టణంలో మొత్తం 5500 నివాస గృహాలుండగా, చెత్త సేకరణకుగాను 45 మంది పారిశుద్ధ్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతిరోజూ రెండు ట్రాక్టర్లు, మూడు ట్రాలీ ఆటోల్లో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరిస్తున్నారు. ఈ మేరకు ప్రతిరోజూ కనీసం ఐదు మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు.

రెండు నెలలుగా అందని వేతనాలు

పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెలా సక్రమంగా వేతనాలు అందడంలేదు. ఒక్కోసారి రెండు, మూడు నెలలకు ఒకసారి వేతనాలు ఇస్తున్నారు. ఫిబ్రవరి, మే నెలకు సంబంధించి వేతనాలు ఇంత వరకు చెల్లించలేదు. దీంతో తాము కుటుంబాలను పోషించుకోలేక పోతున్నామని, అర్ధాకలితో పనులు చేస్తున్నామని కార్మికులు వాపోతున్నారు. పీఎఫ్ డబ్బులు జమ కోసం ప్రతి నెల తమ వేతనాల్లో నుంచి కట్ చేస్తున్నా అధికారులు తమ ఖాతాలో సక్రమంగా జమ చేయడంలేదని వారు ఆరోపించారు. ప్రతి ఏడాది రెండు జతల దుస్తులతోపాటు సబ్బులు, నూనె, గ్లౌజులు, ఇవ్వాల్సి ఉండగా, అవి పత్తాలేవని వారు విమర్శిస్తున్నారు.

ఆందోళన బాట పట్టిన కార్మికులు

కార్మికుల సమస్యల విషయమై మున్సిపల్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోడంతో కార్మికులు ఆందోళన బాట పట్టారు. గతంలో కూడా పలు మార్లు సమ్మె నిర్వహించగా, అధికారుల హామీ మేరకు విధుల్లో చేరగా సమస్య పరిష్కారం కాలేదు. దీనితో వారు పనులు మానుకొని సమ్మె బాట పట్టారు. ఇకనైనా ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

రెండు రోజుల్లో సమస్య పరిష్కారం



పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందుల పాలవుతారు. రోడ్లపై చెత్తా చెదారం పేరుకుపోతుంది. రెండు నెలల వేతనాలు త్వరలో ఇస్తాం. పీఎఫ్ సక్రమంగా చెల్లిస్తున్నాం.

– దేవేందర్, మున్సిపల్ కమిషనర్

మురుగు కూపంగా పట్టణం

పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే వదిలేయడంతో రోడ్డుపై వెళుతున్న జనాలు ముక్కు మూసుకొని వెళుతున్నారు. రోడ్డుపై ఎక్కడ చూసినా చెత్త కుప్పలే అగుపిస్తున్నాయి. వ్యాపారస్తులు తమ దుకాణాల ఎదుట పడవేసిన చెత్త రోడ్డుపై పరుచుకొని దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి తోడు మురుగు కాలువల నుంచి తీసిన చెత్త అలాగే ఉందని ఆయా కాలనీల ప్రజలు వాపోయారు.

సబ్‌ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలి

- దళితులపై పెరుగుతున్న దాడులు
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు


మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

మెదక్ కలెక్టరేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పటిష్టంగా అమలు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా విస్తృత సమావేశం మెదక్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లాలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కులవివక్షత, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్న చేవెళ్ల డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో దళితులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని అన్నారు. గురుకులాలను కాపాడి దళిత విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె మల్లేష్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏ తుకారాం, నాయకులు నిరంజన్ దాసు, డి మల్లేశం, కె. మల్లేశం, శ్రీనివాస్, నర్సింలు, గీతా, యశోద, దుర్గ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే పేదలకు న్యాయం

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలో ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని, రాబోయే ఎన్నికలలో తిరిగి బీఆర్ఎస్ అధికారంలోనికి వస్తుందన్నారు. టెంకటికి చెందిన సాయమ్మకు రూ.16 వేలు, మాడ్చెట్‌పల్లి శైలజకు రూ.39వేలు, బూర్గుపల్లి సాయిలుకు 14,500ల చెక్కులను అందించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మి, నాయకులు సురేష్‌గౌడ్, దత్తు, అశోక్, మాణిక్‌రెడ్డి, సుభాష్, అంజయ్య, కిష్టయ్య తదితరులు ఉన్నారు.

మట్టి పరీక్షలు తప్పనిసరి


సదస్సులో శాస్త్రవేత్తలు, రైతులు

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఉదయ్ కుమార్

కొల్చారం(నర్సాపూర్): పంట సాగు చేసే ముందు మట్టి నమూనాలు తప్పనిసరి అని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఉదయ్ కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని చిన్నఘనపూర్‌లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పంట సాగులో కాండం తొలుచు పురుగు నివారణ, వరి నారు ప్రధాన పొలంలో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అధిక దిగుబడినిచ్చే వై రకాలను సూచించారు. ప్రకతి సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేయడం భూసారం పెరిగేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులు, యాంత్రిక పద్ధతులను అవలంబించాలని సూచించారు. విత్తనాలు కొనే ముందు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త గురు ప్రసాద్ పాండే, రంగంపేట క్లస్టర్ ఏఈఓ రాజశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

అపరిచితుల వద్ద విత్తనాలు కొనొద్దు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

అల్లాదుర్గం(మెదక్): అపరిచితులు గ్రామాలకు వచ్చి తక్కువ ధరకు ఎరువులు, విత్తనాలు అమ్మితే కొనవద్దని మండల వ్యవసాయాధికారి రాజేశ్ చెప్పారు. శుక్రవారం మండల పరిధిలోని బహిరన్ దిబ్బ గ్రామంలో విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో తక్కువ ధర పేరుతో, కంపెనీల నుంచి వచ్చామని చెప్పి విత్తనాలు అమ్మితే వెంటనే వ్యవసాయాధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అక్రమ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ చెన్నప్ప, ప్రభు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలని పంచాయతీ కార్యదర్శి హన్మంత్ అన్నారు. మండల పరిధిలోని టోప్య తండాలో మంజూరైన ఐదుగురు లబ్ధిదారులకు శుక్రవారం ఇందిరమ్మ ఇంటి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతు మాట్లాడుతూ లబ్దిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు.

◆ జనుము విత్తనాలు పంపిణీకి సిద్ధం

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లో జనుము విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏఓ జావిద్ తెలిపారు. 40 కిలోల బస్తా రూ.2,510 ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. భూమి పట్టా పాసు పుస్తకం ఆధారు కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ పత్రాలు వెంట తీసుకుని రావాలని సూచించారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఆయా గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు రూ 7 లక్షల 41 వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ గురుకుల ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

నర్సాపూర్ రూరల్: మండలంలోని నారాయణపూర్‌లో గల గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ గంగారాం, ప్రిన్సిపాల్ లలితాదేవి తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన గిరిజన బాలికలు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 13న కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

◆ విద్యా వనరుల కేంద్రానికి భూమిపూజ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగిలో మండల విద్యా వనరుల కేంద్రం భవన నిర్మాణ పనులకు ఎంఈఓ గంగాబాయి శుక్రవారం భూమి పూజ చేశారు. రూ.40 లక్షల నిధులతో నిర్మించనున్న విద్యా వనరుల కేంద్రం నిర్మాణం కోసం తహసీల్దార్ కార్యాలయం పక్కన స్థలం గుర్తించారు. కార్యక్రమంలో పీడీ శంకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాబు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

◆ స్వయం ఉపాధిపై అవగాహన

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్, హవేళిఘణాపూర్ మండలాల డ్వాక్రా గ్రూపు మహిళలకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై అవగాహన కల్పించారు. మహిళా సంఘాల సభ్యులకు వ్యాపార ఉత్పత్తులు, మార్కెట్ మెలకువలు నైపుణ్యాభివృద్ధిపై ర్యాంప్ ప్రాజెక్టు డాక్టర్ ప్రవీణ్, సుధీర్, ఇండస్ట్రీయల్ డీఎం మోహన్‌సార్, ఐకేపీ ఏపీఎం ఇందిర, భాస్కర్, సీసీ మహాలక్ష్మి, మత, స్వామి, శంకర్, మెదక్, హవేళిఘణాపూర్ మండలాల మహిళలు పాల్గొన్నారు.

◆ బస్సు సర్వీసు ప్రారంభం

రేగోడ్(మెదక్): రేగోడ్, ఆర్.ఇటిక్యాల మీదుగా పటాన్‌చెరుకు నారాయణఖేడ్ ఆర్టీసీ బస్సు డిపో అధికారులు ఏర్పాటు చేసిన బస్సు సర్వీసును పీసీసీ సభ్యుడు ఎం.కిషన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌పాటిల్, యూత్ నాయకుడు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నిష్ణాతులైన టీచర్లు.. నాణ్యమైన విద్య

జిల్లాలో శుక్రవారం బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని, నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, పైగా మెరుగైన విద్యా బోధన జరుగుతుందని అవగాహన కల్పించారు. బడిబాటను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

- పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి
- ఉపాధ్యాయుల పిలుపు
- జిల్లాలో బడిబాట ప్రారంభం



రామాయంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యాయులు


కొల్చారం మండలం సంగాయిపేటలో ఉపాధ్యాయుల బడిబాట ర్యాలీ

రామాయంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన, నాణ్యమైన విద్య అందజేస్తామని టీఆర్‌టీఎఫ్ (తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ అన్నారు. శుక్రవారం రామాయంపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని సూచించారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్, ఎంఈవో శ్రీనివాస్, సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఐలయ్య, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి మోహన్ శర్మ, రామాయంపేట, నిజాంపేట మండలాల సంఘం అధ్యక్షుడు నాగేందర్, నవీన్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

పాపన్నపేట(మెదక్): బడి బాటను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎంఈఓ ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పాపన్నపేటలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులలో ప్రీప్రైమరీ ఎడ్యుకేషన్ ఇంగ్లిష్ మీడియంలో లభిస్తుందన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. డిజిటల్ బోర్డులతో విద్య అందిస్తామని చెప్పారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, పోషకాహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్వర్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, శ్రీకాంతప్ప, నరేందర్, ఈఓ నయీం, టీచర్లు అంజాగౌడ్, రజిత, నాగరాజు, యాదయ్య, రమేష్, నర్సింలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలి

చిన్నశంకరంపేట(మెదక్): నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చదివించాలని ఎంపీడీఓ దామోదర్ కోరారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం దీప్లారాథోడ్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అలాగే మిర్జాపల్లిలో ఎంఈఓ పుష్పవేణి, జంగరాయిలో తహసీల్దార్ మన్నన్ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొల్చారంలో ర్యాలీ

కొల్చారం(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందింస్తున్నామని శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, ప్రస్తుత విద్యా విధానానికి అనుగుణంగా సాంకేతిక విద్య అందిస్తున్నట్లు కరపత్రాలను పంచారు.

నాణ్యమైన బోధన

నిజాంపేట(మెదక్): కార్పొరేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం నిజాంపేట మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి, పాఠశాల ఏఎంసీ చైర్మన్ వడ్ల నర్మద, ఉపాధ్యాయులు గణేష్, దశరథం, అంగన్వాడీ టీచర్ జ్యోతి, ఆశ వర్కర్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

బొడ్మట్‌పల్లిలో బడిబాట

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలం బొడ్మట్పల్లిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఎంఈఓ సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలోని చేర్పించాలని కోరారు.

బడీడు పిల్లలు బడిలో ఉండాలి

పెద్దశంకరంపేట(మెదక్): బడీడు పిల్లలందరూ బడిలో ఉండేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈఓ వెంకటేశం అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. బడిబాటపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ, హెచ్‌ఎంలు విఠల్, సత్యకుమార్,మారుతి, గ్రామకార్యదర్శి వెంకటరాములు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్‌లో ..

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ బడులలోనే నాణ్యమైన విద్య అందుతుందని చిలప్‌చెడ్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రమేష్ అన్నారు. శుక్రవారం చిలప్‌చెడ్ మండల గ్రామాలలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు బడిబాటపై గ్రామ సభ నిర్వహించారు. అంతకుముందు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షితులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు, సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ చెప్పారు. శుక్రవారం అల్లాదుర్గం పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ ధనుంజయ్య, ఉపాధ్యాయులు, కార్యదర్శి ప్రభాకర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జక్కన్నపేటలో..

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన.జరుగుతుందని ఎంఈవో మధుమోహన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జక్కన్నపేటలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కులకర్ణి, ఉపాధ్యాయులు సత్యం, శీతల్ సింగ్, శృతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ బుచ్చనాయక్ అన్నారు. శుక్రవారం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు.

ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేయాలి

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవన్‌లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల విస్తృత స్థాయి జరిగింది. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రామాలలో దిమ్మెలను నిర్మించి జెండాలు ఎగురవేయాలని కోరారు. లేనిచోట గుర్తించి నూతన దిమ్మెలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అనుబంధ సంఘాల నాయకులు బొజ్జ సైదులు, విజయ్ కుమార్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగు విత్తనాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో 200 బస్తాల జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ స్వప్న తెలిపారు. శనివారం కౌడిపల్లి రైతువేదిక వద్ద టోకెన్లు ఇస్తామని చెప్పారు.

పాంపాండ్‌తో రైతులకు ఉపయోగం

ఎంపీడీఓ శ్రీనివాస్


ముత్రాజ్‌పల్లిలో పాంపాండ్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): పాంపాండ్ నిర్మించుకోవడం వల్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ముత్రాజ్‌పల్లిలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పాంపండ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ పొలాల్లో పాంపండ్ తవ్వించుకుని వర్షం నీటిని నిల్వ చేసుకోవాలన్నారు. దీంతో భూగర్భ జలాలు పెరగడంతోపాటు వర్షం నీటిని ఒడిసి పట్టుకోవచ్చన్నారు. పాంపండ్‌తో రైతులకు నీటి సమస్య తీరుతుందని చెప్పారు. ఉపాధిహామీ పథకంలో ఉచితంగా పాంపాండ్ తవ్వుకునే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిటుక్ల్ గ్రామ శివారులో గల కేజీబీవీలో ఇంటర్మీడియెట్ బైపీసీ గ్రూపు సబ్జెక్టులను బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి అంజలి కోరారు. విద్యార్థులకు ఆంగ్లం, తెలుగుతో పాటు, భౌతిక, రసాయన, జీవశాస్త్రాలు బోధించేందుకు, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 60 శాతం మార్కులు సాధించిన ఆసక్తి గల మహిళలు, తమ విద్యార్హత పత్రాలతో సంప్రదించాలని కోరారు. అలాగే.. చిట్కుల్ కేజీబీవీలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుకునే అమ్మాయిలు సర్టిఫికెట్లు తీసుకొచ్చి పాఠశాలలో సంప్రదించాలని కోరారు.